# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. పోలవరం ప్రాజెక్ట్ వాస్తవ పరిస్థితులను తెలిపేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్లో రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని రాష్ట్ర భవన నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

**3. రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు.**

**4. తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీ 2024 పరీక్ష షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.**

**5. దేశవ్యాప్తంగా ఈ రోజు జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నాం.**

==========================

పోలవరం ప్రాజెక్ట్ గురించి వాస్తవ పరిస్థితులను ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలిపేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నిన్న అమరావతిలో పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి జీవనాడి వంటి పోలవరంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేస్తామని,. ఇందులో మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై రెండో శ్వేతపత్రం ఇస్తామన్నారు. టిడిపి హయాంలో పోలవరం 72 శాతం పూర్తయితే వైసిపి హయాంలో 3.84 శాతం పనులే జరిగాయని చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ నిపుణుల సాయంతో ప్రాజెక్టు మరమ్మత్తులు చేపడతామని పేర్కొంటూ,

...వాయిస్ ...

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని రాష్ట్ర భవన నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నిన్న ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం శోభనాపురంలోరహదారులను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్థానికంగా ఉన్న శోభనాపురం-ఈదర వయా బొద్దనపల్లి రహదారి, గణపవరం అడ్డరోడ్డు-అడవినెక్కలం రహదారి పూర్తిగా

ధ్వంసమైనట్లు గుర్తించామని అన్నారు. ఈ రహదారుల అభివృద్ధి పనులను త్వరలో చేపడతామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నిన్న ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని 2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ చేస్తామన్నారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాల అమలపై దృష్టి పెడతామని చెప్పారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఉంటాయని, బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై శాసన సభలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీ 2024 పరీక్షకు పూర్తి షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు 5వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష సీబీఆర్‌టీ విధానంలో రోజుకు రెండు విడతల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. తెలంగాణలో మొత్తం 11 వేల 62 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి గత ఫిబ్రవరి 28న పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల గడువు ఈ నెల 20వ తేదీతో ముగియగా మొత్తం 2.79 లక్షల దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్‌ను అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ గా నియమించింది. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా ఉన్న రవిశంకర్ అయ్యన్నార్‌ను సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా, శాంతిభద్రతల అదనపు డైరెక్టర్ జనరల్ శంకబ్రత బాగ్చిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం కమాండ్ సమాచార కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నగరపాలక సంస్థల పనితీరుపై నిన్న వెలగపూడి సచివాలయంలో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, వ్యర్థాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని గ్రీన్ స్పాట్‌లుగా మార్చేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డు తీసుకొస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాలువల్లో పూడికలు తొలగించే పనులకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా పైపుల్లో లీక్‌లు నిరోధించడం, పాడైన పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు, మురుగు కాలువల్లో ఉన్న పైపుల తొలగింపు వంటి పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించామన్నారు. డెంగీ, అతిసారం, డయేరియా వంటివి ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు

---------------------------

తెలంగాణ పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నిన్న హైదరాబాద్‌లో విద్యాశాఖ అధికారులు ఫలితాలను విడుదల చేశారు.సప్లిమెంటరీ పరీక్షల్లో 73.03శాతం ఉత్తీర్ణత నమోదైందని

వీరిలో బాలుర ఉత్తీర్ణత 71.01 శాతం కాగా బాలికల ఉత్తీర్ణత 76.37 శాతంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఫలితాలను అధికారిక వెబ్ సైట్‌లో వీక్షించవచ్చని తెలిపారు. పరీక్ష ఫలితాలపై పునః లెక్కింపు, పునః మూల్యాంకనానికి జులై 8వరకు అవకాశం కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా, తెలంగాణలో ఈ నెల 3 నుంచి 13 వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు.

---------------------------

"నిర్ణయాల కోసం సమాచారాన్ని ఉపయోగించడం" అనే ఇతివృత్తంతో జాతీయ గణాంక దినోత్సవాన్ని ఈ రోజు దేశవ్యాప్తంగా నిర్వహించు కుంటున్నాం. ప్రముఖ ఆర్థిక వేత్త ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జూన్ 29వ తేదీన దేశవ్యాప్తంగా అధికారికంగా జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత జీవితంలో గణాంకాల ప్రాధాన్యం పట్ల సాధారణ ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు.. జాతీయ అభివృద్ధి ప్రణాళికల్లో గణాంకాల ఆవశ్యకతను తెలియజేసే విధంగా జాతీయ గణాంక దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి.కాగా జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, కె.పవన్‌కల్యాణ్ ఈ రోజు తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. నిన్న ఆలయ పరిసరాలను పరిశీలించి ఆయన అధికారులకు సూచనలు చేశారు. అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అధిక వర్షాలు కురుస్తున్నందున వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోం శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ అత్యవసర హెచ్చరిక కేంద్రాన్ని మంత్రి పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 8 జిల్లాల కలెక్టర్లు, అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా, అధికార యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక రేపు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీసీ సంక్షేమ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. నిన్న మంత్రి శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండలో

బాలికల కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, ఉపాధ్యాయుల భోదన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యతో పాటు మంచి పౌష్టికాహారం గల భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సదుపాయాల  పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

జాతీయ పరీక్షా సంస్థ–ఎన్‌టీఏలో పరీక్షల నిర్వహణ, సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రులు సూచనలు కోరింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మై గవర్నమెంట్ వెబ్‌సైట్ ద్వారా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయవచ్చని తెలిపింది. జులై 7వరకు ఈ  వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, సమాచార భద్రతలో పురోగతి, ఎన్‌టీఏ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా ఈ కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనుందని అధికారిక వర్గాలు తెలిపాయి.

======================